క్లుప్తంగా

పోప్ ఫ్రాన్సిస్‌కు నివాళి



జనగామ: రోమన్ క్యాథలిక్ అత్యున్నత క్రైస్తవ జగద్గురు పోప్ ఫ్రాన్సిస్‌కు శుక్రవారం జిల్లా కేంద్రంలోని నెహ్రూపార్కు ఏరియా సెయింట్ పాల్స్ స్కూల్‌లో ఘనంగా నివాళులర్పించారు. స్కూల్ హెచ్‌ఎం మరియ జోసఫ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు పోప్ చిత్రపటానికి పూలమాల వేసి కొవ్వొత్తులను వెలిగించి నివాళులర్పించారు. ఆయన పవిత్రమైన ఆత్మకు శాంతి కలగాలని కోరారు.

ఇంటర్‌లో బాలయేసు పూర్వవిద్యార్థుల ప్రతిభ

దేవరుప్పుల: ఇంటర్మీడియట్ పరీక్ష ఫలితాల్లో బాలయేసు ఇంగ్లిష్ మీడియం హైస్కూల్ పూర్వవిద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబర్చడంతో పాఠశాల కరస్పాండెంట్ బ్రదర్ జేసు రాజు హర్షం వ్యక్తం చేశారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ తమ పాఠశాలలో పదో తరగతి చదివిన సూదగాని రోహిత్‌కుమార్(కామారెడ్డిగూడెం) ఇంటర్ ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో 991 మార్కులు, గోలి మహిత 953 మార్కులు, ప్రథమ సంవత్సరంలో కునుసోత్ ఝాన్సీ 466, దొడ్డి వెన్నెల, చింత యామిని 465, శివరాత్రి శ్రావ్య 464, మధు రమీనాక్షి 462, జరుపుల అన్వేష్ 461, బోయిని దిలీప్‌కుమార్ 460 మార్కులు సాధించినట్లు వివరించారు. బాలయేసు విద్యాసంస్థల్లో పొందిన విద్యాభ్యాసం వారిని విజయం వైపు నడిపించే క్రమంలో తల్లిదండ్రుల ఆశీర్వాదం, ఉపాధ్యాయుల మార్గనిర్దేశనం రాష్ట్ర స్థాయి ప్రతిభకు బాటలు వేశాయన్నారు.

గ్రామాల్లో ఎర్ర జెండాలు ఎగురవేయండి

జనగామ రూరల్: మేడేను పురస్కరించుకుని గ్రామాల్లో ఎర్ర జెండాలు ఎగురవేయాలని ఏఐటీయూసీ జిల్లా గౌరవ అధ్యక్షుడు సీహెచ్ రాజారెడ్డి పిలుపునిచ్చారు. ఏఐటీయూసీ కార్యాలయంలో శుక్రవారం మోటే శ్రీశైలం అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎర్రజెండా పోరాట ఫలితంగానే ఎనిమిది గంటల పని విధానాలు అమలు అవుతున్నాయన్నారు. అటువంటి ఎర్రజెండాను చేతబట్టిన సీపీఐ, ఏఐటీయూసీ ఆధ్వర్యంలో గ్రామాల్లో, వార్డుల్లో ఎగురవేయాలని రాజారెడ్డి అన్నారు. ఈ సమావేశంలో ఆకుల శ్రీనివాస్, చామకూర యాకూబ్, గుండెల్లి రాజు, సాయిలు, రాజు, ఐలయ్య, నగేష్, వీర స్వామి, యాకయ్య హమాలీ యూనియన్ల నాయకులు పాల్గొన్నారు.

సమ్మర్ క్యాంపులో ప్రతిభ చాటాలి



మాట్లాడుతున్న ఎంఈఓ రఘునందన్‌రెడ్డి

రఘునాథపల్లి: సమ్మర్ క్యాంపును సద్వినియోగం చేసుకుని తమలోని ప్రతిభను చాటాలని ఎంఈఓ రఘునందన్‌రెడ్డి సూచించారు. శుక్రవారం ఖిలాషాపూర్ ప్రాథమిక పాఠశాల, ఉన్నత పాఠశాలలో పూర్వ విద్యార్థుల కార్పస్‌ఫండ్ ద్వారా ఏర్పాటు చేసిన ఉచిత సమ్మర్ క్యాంపులను ఆయన ప్రారంభించి మాట్లాడారు. ప్రాథమిక పాఠశాలలో 3 నుంచి 5 తరగతులకు డ్రాయింగ్, సాంకేతిక నైపుణ్యాలు, మెడిటేషన్, సామాజిక అంశాలపై, ఉన్నత పాఠశాలలో 6 నుంచి 10 తరగతుల విద్యార్థులకు స్పోకెన్ ఇంగ్లిష్, ఇతర అంశాలపై శిక్షణ ఇస్తారని చెప్పారు. సమ్మర్ క్యాంపులో 120 మంది విద్యార్థులు హాజరు కావడం శుభ పరిణామమని, క్యాంపు ఏర్పాటు చేసిన పూర్వ విద్యార్థులను ఆయన అభినందించారు. సామాజిక వేత్త కేశిపెద్ది నర్సింహారాజు గూగుల్ మీట్ ద్వారా తన సందేశాన్ని అందించారు. ప్రతిభను వెలికి తీయడానికి ఏర్పాటు చేసిన సమ్మర్ క్యాంపును సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఉచితంగా నోట్‌బుక్స్, పెన్నులు, స్నాక్స్ అందించారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు భారతి రవీందర్, ఆలేటి యాదవరెడ్డి, ఉపాధ్యాయులు శ్రీనివాసులు, నర్సయ్య, పంచాక్షరి, రాజమౌళి, దేవరాజ్ పాల్గొన్నారు.

నియామకం



రాకేశ్

రఘునాథపల్లి: వెల్ది గ్రామానికి చెందిన కొయ్యడ రాకేశ్ జిల్లా స్వేరోస్ ప్రధాన కార్యదర్శిగా నియామకం అయ్యారు. ఈ మేరకు స్వేరోస్ రాష్ట్ర కన్వీనర్ చాతల్లా సదానందం శుక్రవారం ఉత్తర్వులు జారి చేశారు. ఈ సందర్భం రాకేశ్ మాట్లాడుతూ అక్షరం, ఆరోగ్యం, ఆర్థికం స్వేరోస్ విధానమన్నారు. జ్ఞాన సమాజ నిర్మాణ లక్ష్యంగా పని చేస్తానని పేర్కొన్నారు. తన నియామానికి సహకరించిన రాష్ట్ర కమిటీ ప్రతినిధి తాళ్లపల్లి వెంకటస్వామి, జిల్లా ప్రధాన కార్యదర్శి అరుణ్, రాష్ట్ర, జిల్లా ప్రతినిధులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

యథేచ్ఛగా ఇసుక దందా

- రాత్రికిరాత్రే వాగుల్లోంచి అక్రమ రవాణా
- పడిపోతున్న భూగర్భ జలాలు
- పట్టించుకోని సంబంధిత అధికారులు



వాగులో ఇసుక తోడేయడంతో ఏర్పడిన గుంతలు

జనగామ రూరల్: జిల్లాలో ఇసుక అక్రమ రవాణా జోరుగా కొనసాగుతోంది. అధిక వర్షాలతో వాగుల్లో భారీగా ఇసుక మేటలు వేయడం, స్వచ్ఛమైనది కావడంతో అక్రమార్కులు ఇసుక దందాను యథేచ్ఛగా కొనసాగిస్తున్నారు. అధికారుల నిర్లక్ష్యం, పోలీసులు పర్యవేక్షణ లేకపోవడంతో ఇసుక మాఫియా దందా మూడు పువ్వులు ఆరుకాయలుగా సాగుతోంది. మండలంలోని చీటకోడూర్, గానుగుపహడ్, యశ్వాంతాపూర్ వాగు, ఎర్రగొల్లపహడ్ గ్రామాల్లో ఇసుక దందా జోరుగా కొనసాగుతోంది. ఇసుక ట్రాక్టర్‌కు రూ.4 వేల నుంచి 5 వేలు, లారీకి రూ.20 నుంచి రూ.30 వేల వరకు వసులు చేస్తూ పట్టణానికి, వివిధ గ్రామాలకు తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. వాగుల్లో ఇసుక లేకపోవడం వల్ల భూగర్భ జాలలు ఇంకిపోయే ప్రమాదం ఉందని పలువురు వాపోతున్నారు. భూగర్భ జలాలు అడుగంటడంతో చుట్టూ ఐదు కిలో మీటర్ల వరకు జీవాల మనుగడకు ప్రమాదం ఉందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అంతే కాకుండా బోరు బావుల్లో నీళ్లు ఇంకిపోయి వేసవిలో తాగు, సాగునీటి కష్టాలు ఎదుర్కోవల్సి వస్తుంది. ఇప్పటికే భూగర్భ జలాలు అడుగంటడంతో పక్షులు వేసవి తాపాని రాలిపోతున్నాయి. ఇసుక అక్రమ రవా ణాపై వివిధ గ్రామాల ప్రజలు అధికారులకు పలు మార్లు విన్నవించినా ఫలితం లేదు. పోలీసులకు సమాచారం ఇస్తున్నారనే నెపంతో ఇసుక మాఫియా కొందరిపై దాడులకు పాల్పడుతోంది. పోలీసుస్టేషన్‌లో కేసులు పెట్టినా ఇసుక దందా ఆగడం లేదు. ఇటీవల కలెక్టర్ రిజ్వాన్ బాషా ఇసుక అక్రమ రవాణాపై ప్రత్యేక దృషి పెట్టాలని పోలీసులకు తెలిపినా కలెక్టర్ ఆదేశాలు బేఖాతర్ చేస్తూ ఇసుక రవాణా చేస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు ఇసుక రవాణాపై ప్రత్యేక దృష్టి సారించి కఠిన చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

దృష్టిసారించని అధికారులు..

నిర్మాణాల్లో కీలకం ఇసుక. అయితే గ్రామాల్లో, వాగుల్లో ఉన్న ఇసుకను రాత్రికి రాత్రే ఇసుక మాఫియా వందల కొద్ది ట్రాక్టర్లలో తరలిస్తున్నా పట్టించుకున్న నాథుడే కరువయ్యారు. ముఖ్యంగా ఇసుక అక్రమ రవాణాను కట్టడి చేయాల్సిన రెవెన్యూ, మైనింగ్ శాఖల అధికారులు అటువైపు దృష్టి సారించడం లేదు. దీంతో వారి పనితీరుపై పలు వి మర్శలు వస్తున్నాయి. అధికారలు నిత్యం పర్యవేక్షణ చేపట్టి ఇసుక దందా కట్టడి చేయాలని పలువురు విజ్ఞప్తి చేస్తున్నారు.

తరలింపును అడ్డుకోవాలి



మండలంలో ఇసుక తరలింపును అడ్డుకోవాలి. ఇదే విషయంపై పలు మార్లు అధికారులకు విన్నవించినా ఫలితం లేదు. రోజూ వందల సంఖ్యలో ట్రాక్టర్లలో ఇసుక తరలిస్తున్నారు. వాగుల్లో ఇసుక తరలించడంతో భూగర్భ జలాలు అడుగంటి పరిసరాల రైతులకు సాగు, తాగునీటి ఇబ్బందులు తప్పడం లేదు. వెంటనే అధికారలు స్పందించి ఇసుక అక్రమ రవాణా చేయకుండా చర్యలు తీసుకోవాలి.

\- నరేశ్, యశ్వంతాపూర్

కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించండి

- డీఆర్డీఓ వసంత



నర్మెట: బొమ్మకూర్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రం సందర్శనలో డీఆర్డీఓ వసంత

నర్మెట: రైతులు ధాన్యాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించి మద్దతు ధర పొందాలని డీఆర్డీఓ నాయక్‌వాడి వసంత అన్నారు. బొమ్మకూర్, హన్మంతాపురం, గండి రామారంలలో ఐకేపీ మహిళా సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసి ధాన్యం కొనుగోలు కేంద్రాలను శుక్రవారం సందర్శించిన ఆమె రైతులకు, నిర్వాహకులకు, హమాలీలకు పలు సూచనలు చేశారు. ధాన్యంలో నాణ్యత ప్రమాణాలను పాటించాలని, దళారులకు విక్రయించి మోస పోరాదని, వెంట వెంటనే కాంటాలు వేసి మిల్లులకు తరలించాలని, తూకంలో మోసాలకు పాల్పడరాదని చెప్పారు. ఆమె వెంట సీసీలు బత్తిని యాదగిరి, కవిత, కనక రాజు, సంఘాల సభ్యులు, రైతులు ఉన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

జఫర్‌గఢ్: ఉప్పుగల్లులో ఏకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఏపీఎం రవీందర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు పండించిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లో విక్రయించాలని అన్నారు. సీసీ మేర్గు నర్సింగం, వీఓ అధ్యక్షురాలు శ్రీవాణి, కాంగ్రెస్ మండల నాయకులు పొరెడ్డి సత్యనారాయణరెడ్డి, పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు లెంకల రాజు, సొసైటీ డైరెక్టర్ గడ్డం రాజు, మహిళా సంఘాల సభ్యులు విజయ, రజిని, కోమల, మంజుల, వహిదా, జయ, హైమ, రమ రైతులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి భూమిపూజ



బచ్చన్నపేట: మండలంలోని సాల్వాపూర్ గ్రామంలో కులదైవాలైన బీరప్ప, కామరాతి, అక్క మహంకాళి దేవతల ఆలయ నిర్మాణానికి కురుమ సంఘం నాయకులు శుక్రవారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకుడు బండకింది హరిబాబుగౌడ్ మాట్లాడుతూ ఆలయ నిర్మాణానికి గ్రామానికి చెందిన రిటైర్డ్ వీఆర్‌ఓ సానం రమేశ్‌గౌడ్ స్థలాన్ని విరాళంగా అందించారని తెలిపారు. ఆలయం పూర్తయ్యాక పండుగను ఘనంగా నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో సానం సంతోష్, మల్లేష్‌యాదవ్, బండకింది మహారాజ్, ఎర్రోళ్ల యాదగిరి, తదితరులు పాల్గొన్నారు.

ఉగ్రవాదుల దాడికి నిరసన



జనగామ రూరల్: నిరసన తెలుపుతున్న ముస్లింలు



రఘునాథపల్లి: కొవ్వొత్తుల ర్యాలీ తీస్తున్న అఖిలపక్ష నాయకులు

జనగామ రూరల్/ స్టేషన్‌ఘన్‌పూర్/ పాలకుర్తిటౌన్/జఫర్‌గఢ్/రఘునాథపల్లి : జమ్ము కాశ్మీర్‌లోని పహల్గాంలో పర్యాటకులపై ఉగ్రవాదులు చేసిన దాడిని నిరసిస్తూ జనగామలోని ఏక్ మినార్ మక్కా మసీదులో, స్టేషన్‌ఘన్‌పూర్ మండలంలోని శివునిపల్లి మజీద్ వద్ద ముస్లింలు ప్లకార్డులు, నల్లబ్యాడీలతో నిరసన తెలిపారు. ఉగ్రవాదుల దాడిలో మృతిచెందిన వారి ఆత్మకు శాంతి కలగాలని కోరుతూ వారి కుటుంబాలకు ప్రగాఢ సంతాపం తెలిపారు. ఆయా కార్యక్రమాల్లో ముస్లిం డెవలప్‌మెంట్ కమిటీ జిల్లా అధ్యక్షుడు జమాల్ షరీఫ్, అఫ్జల్, ఇక్బాల్, హమీద్, సలీం, రఫీ, ఎండి.దస్తగిరి, రహీంబేగ్, షేక్ కమరుద్దీన్, మహమూద్‌అలీ, షాకీర్, గౌస్‌పాషా, యాకూబ్‌పాషా, జానీపాషా, రహమాన్ తదితరులు పాల్గొన్నారు. అలాగే పాలకుర్తి, జఫర్‌గఢ్‌లో బీజేపీ, రఘునాథపల్లిలో అఖిలపక్షం ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో ర్యాలీ, దిష్టిబొమ్మను దహనం చేశారు. ఆయా కార్యక్రమాల్లో ప్రసాద్, వెంకటేశ్వర్లు, కృపాకర్, సింగారపు రమేశ్, లింగాయాదవ్, బొల్లం అజయ్, పోకల శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసరాల అందజేత



పాలకుర్తి: మండల కేంద్రానికి చెందిన ఎం.డి మైబూ(హమాలి) ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. కాగా, శుక్రవారం అమ్మ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో బాధిత కుటుంబానికి 50 కిలోల బియ్యం, నిత్యావసర సరుకులు అందజేశారు. బచ్చు సాయిరాం జన్మ దినం సందర్భంగా సహాయాన్ని అందజేసినట్లు ట్రస్టు సభ్యులు తెలిపారు. ట్రస్టు చైర్మన్ యతిపతి శ్రీకాంత్, కార్యదర్శి జీడీ హరిష్, కోశాధికారి కుమారస్వామి, రత్నాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రెయిలింగ్ ఏర్పాటు



దేవరుప్పుల: మండల కేంద్రంలోని గ్రామ ఆవిర్భావానికి ప్రతీకగా పునఃప్రతిష్ఠాపన చేసిన బొడ్రాయి గద్దెకు స్థానిక పీఏసీఎస్ డైరెక్టర్ పెద్ది కృష్ణమూర్తిగౌడ్ ఆధ్వర్యంలో భక్తుల సౌకర్యార్థం రెయిలింగ్ పనులు శుక్రవారం చేపట్టారు. ఈ పనులతోపాటు బొడ్రాయి తృతీయ వార్షికోత్సవానికి సుమారు రూ.3.50 లక్షల సాయం అందించిన కృష్ణమూర్తిని గ్రామస్తులు అభినందించారు.

బీఆర్‌ఎస్‌తోనే తెలంగాణకు ఆత్మగౌరవం



దేవరుప్పుల: వాల్‌పోస్టర్లు ఆవిష్కరించిన సుందర్‌రామిరెడ్డి తదితరులు

దేవరుప్పుల: బీఆర్‌ఎస్‌తోనే తెలంగాణ ప్రజలకు ఆత్మగౌరవం లభించిందని ఆ పార్టీ జిల్లా నాయకులు పల్ల సుందర్‌రామిరెడ్డి, బబ్బూరి శ్రీకాంత్‌గౌడ్ అన్నారు. శుక్రవారం నీర్మాల, పెద్దమడూరులో రేపటి బీఆర్‌ఎస్ రజతోత్సవ సభ వాల్‌పోస్టర్లను ఆవిష్కరించి జనసమీకరణ కోసం సమావేశాలు వేర్వేరుగా నిర్వహించారు. బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు దయాకర్, వర్కింగ్ ప్రెసిడెంట్ రామ్‌సింగ్, నర్సిరెడ్డి, ఉమేష్, చంద్రమౌళి, నర్సింహ్ములు, మల్లారెడ్డి, సత్తయ్య, గిరి పాల్గొన్నారు.

రజతోత్సవ సభకు దండుగా తరలిరావాలి

కొడకండ్ల: ఈ నెల 27వ తేదీన ఎల్కతుర్తిలో నిర్వహించే బీఆర్‌ఎస్ రజతోత్సవ సభకు దండుగా ప్రజలంతా తరలివచ్చి విజయవంతం చేయాలని జీసీసీ మాజీ చైర్మన్ అభిమన్‌గాంధీనాయక్, మాజీ వైస్ ఎంపీపీ వీరస్వామిలు కోరారు. గిర్నితండ, నర్సింగాపురం గ్రామాల్లో నిర్వహించిన సమావేశాల్లో వారు మాట్లాడారు. మోసపూరిత హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం వాటని అమలులో ఘోరంగా విఫలమైందన్నారు. నాయకులు జ్యోతి, సోమరాములు, వెంకన్ననాయక్, రాజ్‌కుమార్, రమేష్, సతీష్‌గౌడ్, శివ పాల్గొన్నారు.


బీఆర్‌ఎస్‌కు పూర్వ వైభవం

రఘునాథపల్లి: రజతోత్సవ సభతో బీఆర్‌ఎస్‌కు పూర్వ వైభవం రానుందని ఆ పార్టీ రాష్ట్ర నాయకురాలు గాడిపెల్లి ప్రేమలతారెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని నిడిగొండ, ఫతేషాపూర్, ఇబ్రహీంపూర్‌లో ఆమె పార్టీ నాయకులు, కార్యకర్తలతో జన సమీకరణపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె వాల్‌పోస్టర్లను ఆవిష్కరించి మాట్లాడారు. కుమార్ గౌడ్, విజయ్, నాయకులు పాల్గొన్నారు.

విజయవంతం చేయాలి

జనగామ రూరల్: ఈనెల 27 జరగబోయే బీఆర్‌ఎస్ రజతోత్సవ సభ విజయవంతం చేయాలని మాజీ ఎంపీపీ మేకల కళింగ రాజు పిలుపునిచ్చారు. మండలంలోని శామీర్‌పేట గ్రామంలో గ్రామ శాఖ అధ్యక్షుడు చాట్ల డానియల్ ఆధ్వర్యంలో సన్నాహక సమావేశం నిర్వహించారు.నిమ్మల స్వామి, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలంతా బీఆర్‌ఎస్ వైపు చూస్తున్నారు



కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న రాజయ్య

స్టేషన్‌ఘన్‌పూర్: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై అన్ని వర్గాల ప్రజలు విసుగుచెందారని, ప్రస్తుత పరిస్థితుల్లో ప్రజలంతా బీఆర్‌ఎస్ వైపు చూస్తున్నారని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య అన్నారు. సముద్రాల గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ పడిశాల సుగుణవెంకటేష్, కాంగ్రెస్ మండల నాయకులు కుమ్మరి శ్రీను శుక్రవారం హనుమకొండలోని డాక్టర్ రాజయ్య కార్యాలయంలో ఆయన సమక్షంలో కాంగ్రెస్ పార్టీ నుంచి బీఆర్‌ఎస్‌లో చేరారు. వారికి రాజయ్య కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని పలు గ్రామాల నుంచి అధిక సంఖ్యలో కాంగ్రెస్ పార్టీ నుంచి బీఆర్‌ఎస్‌లోకి చేరుతున్నారన్నారు. ఈనెల 27వ తేదీన నిర్వహించనున్న బీఆర్‌ఎస్ రజతోత్సవసభకు పార్టీ శ్రేణులు, ప్రజలు భారీగా హాజరై జయప్రదం చేయాలని ఆయన కోరారు. బీఆర్‌ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు మాచర్ల గణేష్‌గౌడ్, నాయకులు మారపాక రవి, అక్కినపెల్లి బాలరాజు, తాటికొండ సురేష్, కనకం గణేష్,సోమిరెడ్డి పాల్గొన్నారు.

పరామర్శ



నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే పల్లా



నివాళులర్పిస్తున్న డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి

నర్మెట: మాజీ సర్పంచ్, మాజీ జెడ్పీటీసీ, కాంగ్రెస్ నాయకుడు గాదె మోహన్ రెడ్డి (75) అనారోగ్యంతో గురువారం మృతిచెందారు. గుంటూర్‌పల్లిలో శుక్రవారం క్రిస్టియన్ సంప్రదాయంలో ఆయన అంత్యక్రియలు నిర్వహించారు. కాగా, ఎమ్మెల్యే డా.పల్లా రాజేశ్వర్‌రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి వేర్వేరుగా పార్టీ శ్రేణులతో కలిసి పార్థీవ దేహానికి పూలమాలల వేసి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. వారివెంట బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు గద్దల నర్సింగారావు, ఉమ్మడి మండలాల కన్వీనర్ పెద్ది రాజిరెడ్డి, మండల అధ్యక్షుడు చింతకింది సురేష్, కన్వీనర్ నీరటి సుధాకర్,

పరిసరాల శుభ్రత పాటించాలి

- డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ సుధీర్‌కుమార్



స్టేషన్‌ఘన్‌పూర్: ర్యాలీని ప్రారంభిస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌ఓ సుధీర్‌కుమార్

స్టేషన్‌ఘన్‌పూర్/చిల్పూరు: ప్రతి ఒక్కరూ పరిసరాల శుభ్రత పాటించాలని స్టేషన్‌ఘన్‌పూర్ డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ సుధీర్‌కుమార్ అన్నారు. శుక్రవారం ప్రపంచ మలేరియా నివారణ దినోత్సవం సందర్భంగా స్టేషన్‌ఘన్‌పూర్ సీహెచ్‌సీ ఆధ్వర్యంలో ర్యాలీ, నష్కల్ పీహెచ్‌సీలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ముఖ్య అతిథిగా హాజరైన మాట్లాడారు. మలేరియా వ్యాధిని సమూలంగా నిర్మూలించేలా ప్రతి ఒక్కరూ పాటుపడాలన్నారు. దోమల నివారణకు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకుంటూ తగిన చర్యలు చేపట్టాలన్నారు. డాక్టర్లు ఎండీ.రుబీనా, కుశాలి, సీహెచ్‌ఓ వెంకటస్వామి, హరిప్రసాద్, ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

మలేరియాపై అవగాహన కలిగి ఉండాలి

కొడకండ్ల: దోమ ద్వారా సంక్రమించే మలేరియా వ్యాధిపై అవగాహన కలిగి ఉండాలని, దోమలు వ్యాప్తి చెందకుండా పరిసరాల పరిశుభ్రతను ప్రతీ ఒక్కరు పాటించాలని వైద్యాధికారి హరికృష్ణ అన్నారు. ప్రపంచ మలేరియా దినోత్సవాన్ని పురస్కరించుకుని మండలకేంద్రంలో పీహెచ్‌సీ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ స్నేహలత, వైద్య సిబ్బంది, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

పశువుల అక్రమ రవాణా అడ్డగింత

- పోలీసులకు అప్పగింత



ట్రాలీలో అక్రమంగా తరలిస్తున్న గోవులు, గేదెలు

జనగామ: పశువధశాలకు అక్రమంగా తరలిస్తున్న గోవులు, గేదెలను పట్టుకుని పోలీసులకు అప్పగించిన సంఘటన జిల్లా కేంద్రంలో శుక్రవారం జరిగింది. విశ్వహిందూ పరిషత్ ప్రతినిధి, గోసంరక్షకులు డాక్టర్ మోహనకృష్ణ భార్గవ, కార్యకర్తల ఆధ్వర్యంలో పట్టణంలోని నెహ్రూ పార్కు, బస్టాండు ప్రాంతాల్లో మూడు వాహనాల్లో తరలిస్తున్న 27 ఆవులు, గేదెలను పట్టుకున్నారు. పోలీసులకు సమాచారం ఇవ్వగా వారు వెంటనే అక్కడకు చేరుకోగా, వాటిని అప్పగించారు. మోహనకృష్ణ భార్గవ మాట్లాడుతూ గోవులు, పశువులను అక్రమంగా తరలించడం, వధించడం చట్టరీత్యా నేరమన్నారు. నిమిషాల వ్యయధిలో పట్టణం నుంచి వందలాది గోవులను తరలిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. హిందువుల ఎద్దులను నంది స్వరూపంగా ఆరాధిస్తారని, గోవుల సంరక్షణ ప్రతీ ఒక్కరి బాధ్యత అన్నారు. ఈ విషయంలో హిందువులు మరింత చైతన్యవంతులుగా మన ఆరాధ్య దైవాల క్రయ, విక్రయాలు నిలువరించి, గోవంశాన్ని కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. ఒక్కో వాహనంలో పదుల సంఖ్యలో కుక్కి కుక్కి తీసుకు వెళ్లడం.. వాటిని ఎంతమేర హింస పెడుతున్నారో అర్థమవుతోందన్నారు. కార్యక్రమంలో గోరక్షా ప్రముఖ్ పసునూరి సందీప్, చిక్కుడు నగేష్, టి.సాయికుమార్ పాల్గొన్నారు.

నారాయణరెడ్డి ఆశయాలను కొనసాగించాలి



జనగామ రూరల్: నివాళులర్పిస్తున్న నాయకులు

జనగామ రూరల్/స్టేషన్‌ఘన్‌పూర్: ఉమ్మడి వరంగల్ జిల్లా సీపీఎం నాయకుడు, ఇప్పగూడెం మాజీ సర్పంచ్ మంతెన నారాయణరెడ్డి ఆశయాలను కొనసాగించాలని సీపీఎం నాయకులు అన్నారు. జిల్లా కేంద్రంలోని, స్టేషన్‌ఘన్‌పూర్ మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయాల్లో నారాయణరెడ్డి వర్ధంతిని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నాడు భూమి కొరకు, భుక్తి కోసం, వెట్టి చాకిరీ విముక్తి కోసం సాగిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారసత్వాన్ని పునికిపుచ్చుకుని నారాయణరెడ్డి ఘన్‌పూర్ ప్రాంతంలో కమ్యూనిస్టు పార్టీని నిర్మించారని కొనియాడారు. నేటి తరం యువత ఆయన ఆశయాలను కొనసాగించాలని, ప్రజాపోరాటాలను చేయడమే ఆయనకు ఇచ్చే అసలైన నివాళులని తెలిపారు. ఆయా కార్యక్రమాల్లో సీపీఎం జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి, ల్లా కార్యదర్శి వర్గసభ్యురాలు ఇర్రి అహల్య, జోగు ప్రకాశ్, బూడిద గోపి సుంచు విజేందర్, ఉపేందర్, ధర్మ భిక్షం, మునిగెల రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

పోషకాహార విలువలు తెలియజేయాలి



లింగాలఘణపురం: పోషణ పక్షోత్సవంలో పాల్గొన్న సీడీపీఓ రమాదేవి, ఎంపీడీఓ జలేందర్‌రెడ్డి తదితరులు

- సీడీపీఓ రమాదేవి

లింగాలఘణపురం: గర్భిణులు, బాలింతలు, బాలికలకు అంగన్‌వాడీ టీచర్లు పోషక ఆహార విలువలు తెలియజేసి ఆరోగ్యంగా ఉండే విధంగా చూడాలని సీడీపీఓ రమాదేవి అన్నారు. శుక్రవారం బండ్లగూడెం రైతు వేదికలో మండల స్థాయి పోషణ పక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీ డాక్టర్ హారిక గర్భిణులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. అదేవిధంగా మహిళ సాధికారతపై జిల్లా కోఆర్డినేటర్ శారద మాట్లాడుతూ మహిళలు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని అన్నారు. సామూహిక అక్షరాభ్యాసాలు, శ్రీమంతాలు, గ్రాడ్యుయేషన్ డే నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ జలేందర్‌రెడ్డి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు హంసమ్మ, పుష్ప, పవిత్ర, హెల్త్ సూపర్‌వైజర్ సుజాత, ఏఎన్‌ఎం స్వరూప, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు, తల్లులు, పిల్లలు తదితరులు పాల్గొన్నారు.

చిల్పూరు: మాతా శిశు సంక్షేమమే లక్ష్యంగా అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని సీడీపీఓ ఫ్లోరెన్స్ అన్నారు. చిల్పూరు సెక్టార్ పల్లగుట్ట గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ పక్షోత్సవాల్లో భాగంగా మండల సూపర్‌వైజర్ దూలమ్మ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ఫ్లోరెన్స్ పాల్గొని మాట్లాడారు. అంగన్‌వాడీ టీచర్లు రూప, రమాదేవి, రమ, రజిత, కలిస్క లతో పాటు ఏఎన్‌ఎంలు తదితరులు పాల్గొన్నారు.

'అంగన్‌వాడీ' సేవలు వినియోగించుకోవాలి

జఫర్‌గఢ్: అంగన్‌వాడీ కేంద్రాల్లో అందించే సేవలను వినియోగించుకోవాలని అంగన్‌వాడీ టీచర్లు కోత్వాల ఉమ, పిల్లి నాగమణి కోరారు. మండల కేంద్రంలోని 4, 5 అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రీ స్కూల్ డే కార్యక్రమాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పిల్లలకు ప్రోగ్రెస్ కార్డులు అందజేశారు. ఈ కార్యక్రమంలో తల్లులు, పిల్లలు తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

మాజీ ఎంపీపీ తేజావత్ గోవర్ధన్, మాజీ జెడ్పీటీసీ మాలోత్ శ్రీను, మాజీ జెడ్పీ కోఆప్షన్ ఎండీ గౌస్, మాజీ సర్పంచ్ నర్రా వెంకట రమణారెడ్డి, జనగామ మార్కెట్ చైర్మన్ బనుక శివరాజ్ యాదవ్, కాంగ్రెస్ మండల శాఖ అధ్యక్షుడు రాజబోయిన లక్ష్మీ నారాయణ, మహిళా అధ్యక్షురాలు దేవులపల్లి భాగ్యలక్ష్మి, సీనియర్ నాయకులు ఉన్నారు.

కొండయ్య మృతి తీరని లోటు



పాలకుర్తి: కాంగ్రెస్ పార్టీకి ఎనలేని సేవలందించిన బన్నెపాక కొండయ్య(60) మృతి పార్టీకి తీరని లోటని మాజీ ఎంపీపీ కారుపోతు శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం చెన్నూరు గ్రామానికి చేరుకుని కొండయ్య మృతదేహానికి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.17వేల సాయం అందజేశారు. మండల యూత్ అధ్యక్షుడు మదాసు హరీశ్, వీఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు మొలుగూరి యాకయ్య, మాదాసు ఉప్పలయ్య, ఎలయ్య, జక్కుల కొండయ్య, నోముల సతీష్, శ్రీశైలం ఉన్నారు.

పోలీస్ కళాజాతా

స్టేషన్‌ఘన్‌పూర్: తాటికొండ గ్రామంలో స్టేషన్‌ఘన్‌పూర్ పోలీసుశాఖ ఆధ్వర్యంలో శుక్రవారం కళాజాతా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై వినయ్‌కుమార్ మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణకు పౌరులందరూ బాధ్యతగా పనిచేయాలన్నారు. శాంతియుత సమాజ స్థాపనకు అందరూ సహకరించాలన్నారు. వీపీఓ కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

లబ్ధిదారులు వివరాలు అందించాలి



బచ్చన్నపేట: మండలంలో ఇందిరమ్మ ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులు వివరాలను అందించాలని ఎంపీడీఓ వెంకటమల్లికార్జున్ అన్నారు. శుక్రవారం కేసిరెడ్డిపల్లి, కొడవటూర్, బండనాగారం గ్రామాల్లో పలువురు లబ్ధిదారుల ఇళ్ల వద్దకు వెళ్లి క్షేత్ర స్థాయిలో ఆయన పరిశీలించారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శులు బృంగి రూపాచైతన్య, అనిల్‌రాజ్, భరత్ కిషోర్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.